# ఊహానుబంధం

టి. వి. ఆర్. కోటేశ్వరరావు

"ఏమండీ, మీరు వేసే బొమ్మలు చూస్తే, ఎవరో జ్ఞాపకం వస్తూంటారండీ?" అన్నాడు రామారావు మామూలు ధోరణిలో.

"ఎవరు జ్ఞాపకం వస్తున్నారు. ఆ బొమ్మలు చూస్తూంటేను యిప్పుడు! అన్నాను నేను ఆశ్చర్యార్థకంగా.

"పద్మావతి అనే అమ్మాయి పోలికలు యిందులో కన్పిస్తున్నాయి." అన్నాడు.

"పద్మావతి ఎవరు? ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"బి.ఎ ఫైనలియర్‌లో వుండగా మనం, ఫస్టియర్ బి.యస్‌సి.,లో వుండేది.చాలా అందంగా వుంటుంది! అంతేకాకుండా, నీ బొమ్మల్లో మల్లే రెండు జడలు వేసుకుని, వెనుకొకటి, ముందుకొకటి వేసుకుని, చాలా చలాకీగా వుంటుంది. కోల ముఖం, సన్నని పొడవైన ముక్కు, ముఖానికి అందమిచ్చే ఆ కళ్ళూ, చిరునగవులు ఒలకరించే లేత పెదాలు, ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. అచ్చు అవే పోలికలు ఈ బొమ్మలో వున్నాయి." అన్నాడు రామారావు.

అతను చెప్పిన విషయం చాలా విచిత్రంగా వుంది. నాచిత్రాల్లో పద్మావతి పోలికలున్నాయట! పద్మావతి ఎవరో నాకు తెలీదు. నేను చదువుకొనేటప్పుడు ఆమె కాలేజీలో చదువుతుండేదట. ఆమెను నేను చూసివుంటానని కూడా నేను అనుకోలేకపోతున్నాను. ఎంత ఆలోచించినా అలాంటి అమ్మాయితో నా పరిచయం వున్నట్లనిపించలేదు. బహుశ యధాలాపంగా నేను వేసిన చిత్రాలకు ఆమె పోలికలు వచ్చి వుండాలి.

"అలాగా! అయితే ఈ బొమ్మలు కూడా చూడు." అని అందించాను మరికొన్నిచిత్రాలు.

"చూడు ఈ చిత్రం 'పూవుల తలపులలో సుందరాంగిని', ఆ పద్మావతి పోలికలు యింకా స్పష్టంగా కన్పిస్తున్నాయి. నాదగ్గర ఏమైనా దాస్తున్నావా?" అన్నాడు.

"అంతమాత్రం తెలీదురా! యింతకాలం నుంచీ నాతో తిరుగుతూనూ."

"అది కాదులే. ఏమీ తెలియదంటావు. వెంకట్రావుగారని డాక్టరు, కాలేజీకి వెళ్లే త్రోవలో పెద్ద బోర్డు లేదురా! వాళ్లమ్మాయి పద్మావతి. యిక్కడ బయాలాజికల్ సైన్సెస్ చదువుతూంది." అని మౌనంగా కాసేపు కూచున్నాడు.

"నువ్వు ఎప్పుడూ బొమ్మలు వేస్తూనే కూర్చుంటావు గామోలు. నేను పోతాను." అన్నాడు.

"సాధారణంగా సాయంకాలం బొమ్మలు వేయను. ఉదయమే వేస్తూండేవాడిని. కాని చాలా మంది స్నేహితులు, నేను చేయనివి కూడా ఈ పుస్తకానికి టైటిలు పేజీ వ్రాసి యివ్వమని, నాకొక మంచి పెయింటింగు వేసి యివ్వండని తెగ అడుగుతున్నారు. ఈ వేసే బొమ్మ తెలుగు లెక్చరరుగారు వ్రాస్తున్న నవల తాలూకు టైటిలు పేజీది. యిప్పటికిది పది రోజులనుంచి రోజూ వస్తూ జ్ఞాపకం చేస్తూంటారు. కాలేజీ వదిలి పెట్టేసారుగా! యిక వస్తూంటారు! ఏ అయిందనిపించి వారికిచ్చేస్తేనే కాని బాగుండదని వేస్తున్నాను." అన్నాను.

"సరే, వస్తానంటూ" సైకిలు మీద వెళ్ళిపోయాడు రామారావు.

రామారావు ఈమధ్య పరిచయం ఎక్కువయినా, అసలు క్రొత్తవాడు గాదు. యింటర్ కూడా కలిసి చదువుకున్నా అంత సన్నిహితం లేదు. రానురాను బి.ఎ లో మా పరిచయం చాలా బలవత్తరమయింది. మనిషి చాలా నీటుగా వుంటాడు. ఉంగరాల జుట్టు. చామనచాయ రంగు. ఎప్పుడూ తెల్లని బట్టలు కడుతూంటాడు. ఫస్టుమార్కులు రాకపోయినా, అల్లరి చేసేవాళ్ల లిస్టులో మాత్రం లేడు. మాతో పాటే యించుమించు వుండేవాడు. సాహిత్యం అంటే చాల యిష్టం అతనికి. నా బొమ్మల్ని చూచి తరచు అభిప్రాయాలు చెప్తూవుంటాడు. యింతవరకు అతనిచ్చిన అభిప్రాయంలో నేనొక దానికి అడ్డుచెప్పలేదు.

కాని నేనింతవరకు ఎరగని అమ్మాయి, "పద్మావతి పోలికలు ఎలాగ వచ్చాయి!" అని ఆశ్చర్యపడ్డాను.

రామారావు వెళ్లిన తర్వాత చాలసేపు పద్మావతిని గూర్చి ఆలోచించాను. ఆ అమ్మాయిని ఎప్పుడూ చూచిన జ్ఞాపకం రాలేదు. ఆమె డాక్టరు వెంకట్రావుగారమ్మాయట! డాక్టరు వెంకట్రావుగారు మంచివారని ఎంతో మంది నోటమీదుగా తాను విన్నాడు. ఒకసారి చూసాడు కూడాను. నాలుగురోజులు జ్వరం వచ్చి కాలేజీ మానేసి, సిక్‌లీవు ఎప్లయి చేయడానికి సర్టిఫికేట్ కోసం తానువెళ్లి ఆయనగార్ని అడిగాడు. ఆయన గారి దగ్గర ట్రీట్‌మెంట్ చేయించుకోకపోయినా సర్టిఫికేట్ యిచ్చారు. అప్పటినుండీ, ఎప్పుడయినా జ్వరం ఎస్తే ఆయనగారి దగ్గరే మందు పుచ్చుకుంటూండేవాడిని. చాలా మంచివారు.అందు చేతనే వూరికి చివరయినా, ఎంతోమంది రోగులు వస్తూపోతూంటారు. అలాగే బాగా సంపాదిస్తున్నారు కూడాను. వచ్చిన రెండు సంవత్సరాల్లోనే చాలా పెద్దడాక్టర్లలో ఒకడని పేరుపడ్డారు.

కాలేజీలో చదివినంతకాలం ఏ అమ్మాయితోను పరిచయం ఏర్పరచుకోలేదు. కనీసం మాట్లాడి కూడా ఎరుగను. నన్ను గూర్చి చాలామంది తెలుసుకొని వుండవచ్చు. మేగజైన్లలో నా బొమ్మలు తరచు పడుతుండేవి. అందువల్ల చాలామందికి నేను తెలిసివుండే అవకాశం వుంది.

రాత్రంతా పద్మావతిని గూర్చే ఆలోచనలు. పద్మావతి బి.యస్.సి బయాలాజికల్ సైన్సు చదువుతోంది. పద్మావతి నా వూహాసుందరి బహుశ ఆమె కూడా డాక్టరవుతుంది గాబోలు. తండ్రిపేరు నిలబెడుతుంది. ఎలాగయినా వీలయినపుడు ఆ అమ్మాయిని చూడాలనుకొన్నాను. నేను చూడాలని చూస్తున్నట్లు ఆ అమ్మాయికి తెలిస్తే ఏమైనా బాగుంటుందా? కుదరదు. కాని పద్మావతి తనకు తెలియకుండా మనస్సులో ఒక స్థానం ఏర్పరచుకొంది. ఎందుకో తెలియదు. నా చిత్రాలు బాగున్నాయి. కాలేజీ విడిచిపెట్టిన తర్వాత చాలామంది అమ్మాయిలతో పరిచయం అయ్యింది. వాళ్లంతా నాచిత్రాల్ని పొగిడారు. అందులో పార్వతి, "మీ చిత్రాలు చూస్తున్నంతసేపూ, నేను నన్ను మరచిపోతాను. అంత ఆకర్షణశక్తి మీ చిత్రాల్లో ఉంది." అంది. సరోజ ఒక రోజు "మీ చిత్రాలు ఈమధ్య తరచుగా చూస్తున్నానండీ. చాలా బాగున్నవి" అంది. అలానే చాలా మంది కనిపించినప్పుడల్లా పొగుడుతూండేవారు. ఎవరిమీద ప్రత్యేక శ్రద్ధ ఏర్పడలేదు. కాని ఈనాడు పద్మావతిని గూర్చి మనస్సు ఆందోళన పడుతోంది.

నాలుగురోజుల తర్వాత ఆ పద్మావతిని చూడాలని చాలాసార్లు ఆయింటి మీదుగా వెడుతూండేవాడిని. కాని దురదృష్టమేమో ఎన్నిసార్లు చూచినా కనీసం ఆ ముఖారవిందం చూచే భాగ్యం లేకపోయింది నాకు. అంత్యమవుతున్న కొద్దీ ఏవేవో తెలియని అనుభూతులు నన్ను చుట్టుముట్టుతున్నాయి. కాని, ఆ అమ్మాయి ఎవరు? నా బొమ్మల్లో, ఆ పోలికలు ఎందుకు రావాలి? నావూహాసుందరిగా నా మనస్సులో నిర్మించుకొన్న ఆకృతి, సజీవితంగా ఉన్నదని తెలిసేసరికి, ఏదో తెలియని నూతనోత్సాహము పెల్లుబికింది.

ఎలాగయినా రామారావుని కలుసుకొని ఆ పద్మావతిని చూడటం ఎలాగ అని అడుగుదామనుకున్నాను. ఆ మరుచటి రోజే రామారావు అనుకోకుండా బజారులో కన్పించాడు. చిరునవ్వుతో పల్కరించాడు.

"ఏమోయ్ ఏమయినా బొమ్మలు వేశావా?"

"లేదు. ఎందుచేతనో వెయ్యలేక పోతున్నాను. కారణం తెలీదు" అన్నాను.

"అవున్లే, అలాగే వుంటుంది. పాపం మనస్సు ఎవరిమీదకూ పరుగెత్తలేదు కదా" అన్నాడు, రామారావు. ఆ వ్యంగ్యానికి మనస్సు బాధపడింది. అయినా అదేమీ గుర్తించకుండా "పద్మావతి వూళ్లో లేదా?" అన్నాను.

"నాకు తెలియదు కాని, వాళ్ళకు ఏదో పిక్‌నిక్ వుందట. రకరకాల మొక్కలు సంపా



దించటానికి వెడతారని విన్నాను. మార్కండేయులు అని వాళ్ళ జ్ఞాపకనే మాటల సందర్భములో చెప్పాడు. ఎప్పుడో సరిగా వినలేదు'' అన్నాడు రామారావు.

నాతోపాటే బజార్లో సామానులని కొనుక్కున్నాడు. ఇద్దరం కలసి కొంతదూరం వచ్చి ఆగిపోయాం. అక్కడనుంచే అతను వారో త్రోవలోంచి వెళ్ళిపోతాడు. చాలాసేపు ఎవరమూ ఏమీ మాట్లాడలేదు. అలాగే నుంచున్నాను.

''ప ద్మా వ తి ని చూడాలనుకుంటున్నాను'' అన్నాను అకస్మాత్తుగా.

అతను ఆశ్చర్యంగా నా ముఖంలోకి చూశాడు. ఒకసారి మెల్లగా నవ్వి ''ఏం—ప్రేమిస్తున్నావా? అన్నాడు.

బహుశా లోకం అంతేనూ! అదే మనలో వున్న లోపం. అతను అలా అన్నందుకు చాలా బాధ పడ్డాను. మిత్రుడనయినా అతను నన్ను అర్థం చేసుకోలేక పోయాడు. ఎవరయినా అమ్మాయి పేరెత్తితే ఆమెని ప్రేమించినట్లు చిలవలు పలవలు అల్లుతారు. ఎవరైనా వయసులో వున్నవారు, యువతీ యువకులు కనపడితే భార్యా భర్తలు కానీ వారికి మెళ్లో పుస్తెలు లేని, ఎవరో ప్రేమికులని యిదమిద్ధంగా తేల్చి పారేస్తుంది లోకం. కాని వారు అన్నాచెల్లెలు అని గాని, మారుటతల్లి, కొడుకు అనిగాని వూహించ లేదు. కనీసం స్నేహితులుగానయినా గుర్తించదు. ఎందుకో వాళ్ళను చూస్తే యిలా అనాలని పిస్తుంది ఎందువల్లో మరి.....? నేను ఆలోచించడం చూసిన రామారావు చిరునవ్వు నవ్వుకొంటూ ''వస్తా బ్రదర్. విష్ యు ఎ గుడ్ లక్'' అంటూ వెళ్ళిపోయాడు.

మామూలుగానే మరి కొన్ని రోజులు గడిచాయి. మనస్సు నిలకడగా లేదు. ఎప్పుడూ పద్మావతిని గురించే ఆలోచన. ఆమె ఆకారాన్ని నింపుకున్న నా చిత్రాలు నన్ను మరింత బాగా ఆలోచింప చేస్తున్నాయి. ఏమీ చెయ్యలేక పోతున్నాను. చిత్రాల్ని కూడా వెయ్యడం లేదు. రోజులు బరువుగా గడుస్తున్నాయి. రామారావు వస్తే బావుండును. కొంత కాలక్షేపంగా ఉండేది.

కాని ఈ మధ్య అతను వచ్చి వారం రోజులయింది. పోనీ అతని కోసం వెడదామని బట్టలు మార్చుకోడానికి లేచి, ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకుని అలా రోడ్డుమీదకు వస్తున్నాను. అంతలోనే 'వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు'గా రామారావు నాకు ఎదురొచ్చాడు.

''ఈ మధ్య అసలు కన్పించటమే మానేశావు'' అన్నాను.

''అన్నట్లు ఓ ముఖ్య విషయం చెప్పుదామని వచ్చాను'' అన్నాడు ఆత్రుతగా.

ఏమిటన్నట్లు ఆశ్చర్యంగా అతని కళ్ళలోకి చూశాను.

''మరేమీ కాదు. పద్మావతికి ఈ మధ్య ఒంట్లో బాగుండటం లేదట. పిక్‌నిక్ వెళ్ళి వచ్చిందగ్గరనుంచీ మనస్సు పాడయిందట'' అన్నాడు.

అర్థం కాలేదన్నట్లు ముఖం చిట్లించాను. అతను చెప్పాడు. ఆదివారం పద్మావతి స్నేహితురాళ్ళతో కలసి, పిక్‌నిక్ వెళ్ళి సాయంకాలం యింటికి వచ్చింది. రాగానే రకరకాల మొక్కల ప్రాక్టికల్సుకి పనికి వచ్చేవి సంచీతో సహితంగా బల్లమీదకు గిరాటు వేసింది. తర్వాత బట్టలయినా మార్చకుండా అలాగే వెళ్ళి మంచంమీద బోర్లా పడుకుని ఏడవడం మొదలు పెట్టింది. పాపం! వాళ్ళమ్మ ఎంతో జాలిగా ఏమయిందమ్మా?'' అని అడిగింది. చివరకు వాళ్ళమ్మ ఎవరయినా అబ్బాయిలు ఏదైనా అన్నారేమో అదే వూరుకుంటుందని అనుకుంది.

మర్నాడు కూడా ఏడుపు తగ్గక పోవడం అటువంటి మనుష్యుల్ని అదోరకంగా చూడటం మొదలు పెట్టింది. పాపం తండ్రి ఎన్నో మందులు వేశాడు. ఏమాత్రం పద్మావతికి స్వస్థత ఈయలేక పోయాయి. పెద్ద డాక్టరు పేరుగన్నాయన మరొకరు కూడా చూచారు. కానీ జబ్బేమిటో యిదమిద్ధంగా తేల్చలేక పోయారు.

మూడు రోజులు అలానే గడిచాయి. పద్మావతికి ఒంట్లో బాగాలేదని తెలిసిన స్నేహితురాండ్రు ఆమెను చూచుటకు వెళ్ళారు రోజా, కమల, సరోజ, పార్వతి మొదలయిన వారంతా కలసి. పద్మావతి, పార్వతిని చూచి తల్లోని పరిమళ మైన తెల్లటి మల్లెపూలని చూచి దగ్గరగా లాక్కొని గట్టిగా కౌగలించుకుంది. ''మల్లె పూలు కావాలంటూ'' లాక్కుంది. యింతలో వాళ్ళమ్మ కుర్రాడిచేత మల్లెపూలు తెప్పించి కూతురికి యిచ్చింది. మళ్ళీ అంతలోనే కమల గులాబి పూలు పెట్టుకుంది. ''అవి కావాలంది''. అవికూడా చాలా తెప్పించి యిచ్చారు. ఆపూలని పద్మావతి హృదయానికి అద్దుకుని వాసన చూస్తూ కూర్చుంది. స్నేహితురాండ్రు పాపం పద్మావతి యిలా అయిందేమిటని చాలా

విచారించి వెళ్ళిపోయారు. యీవిషయం రామారావు చెప్పాడు.

నేను చాలా బాధ పడ్డాను. పాపం పద్మావతికి ఎందుకొచ్చిందిటువంటి జబ్బు అని. కొద్దిరోజుల క్రితమేతాను విన్నాడు. చాలా మంచి అమ్మాయి. అందంగా వుంటుందని. ఎంతో ఆనందంగా గడపవలసిన రోజులు యిలా ఎందుకవో అని ఎంతగానో బాధ పడ్డాను. చివరకి ఆలోచించటానికి కూడా ఏమీ పాలు పోలేదు. సిగరెట్ తీసి ఒకటి అంటించాను. శూన్యంలోకి చూస్తూ చాలాసేపు గడిపాను. వెన్నెల, చీకటి లోకంలో ఒక దాని వెనక ఒకటి ఎలా వస్తుందో,అలాగే సుఖ దుఃఖాలు కూడా మేళవించి వుంటాయి జీవితంలో! లేకపోతే పిక్నిక్ కని ఆడుతూ వెళ్ళిన పద్మావతి, తిరిగి వచ్చే టప్పటికి ఏమి వచ్చిందని? యింతలో ఈ మార్పు. అదే విచిత్రంగా కనిపించింది.

ఆతర్వాత పద్మావతిని గూర్చి మరీ ఎక్కువగా తెలుసుకోవాలనిపించింది. ఎప్పటికప్పుడు రామారావు అన్ని విషయాలు తెలుసుకొని వచ్చి చెప్తూండే వాడు. ఒకరోజు అతను వచ్చి ఒక విషయం చెప్పాడు.

డాక్టరు వెంకట్రావుగారు కూడా కూతురు విషయంలో చాలా జాగ్రత్త తీసుకున్నారట. కాకినాడలోటన స్నేహితులొకాయన రాఘవరావు గారుమానసిక తత్వ పరిశోధనలో చాలా పేరు సంపాదించినవారున్నారట. ఆయనవద్దకు పద్మావతిని తీసుకుని వెళ్ళారట. ఆయన కూడా చాలా సేపు పరీక్షించి ఈ అమ్మాయి ఎవరినో ప్రేమించి వుండాలి. లేకపోతే యిటువంటి చేష్టలు రావని చెప్పారట. కాని తల్లి తండ్రులు "మాకు ఒక్క కూతురే, కాబట్టి అటువంటిది ఏమయినా వున్నా వెంటనే అశ్రద్ధ చెయ్యకుండా పెళ్ళి చేసేవారము. కాని మా అమ్మాయి ఎవర్నీ ప్రేమించలేదని మాత్రం మాకు తెలుసు. ఏమాత్రం ప్రేమించినా చూచాయిగానయినా తెలిసి వుండేది" అన్నారట. చివరకు ఏమయితేనేం రాఘవరావుగారు ఆయనను పిలయినంత వరకు ప్రయత్నం చేస్తామని వారికి ధైర్యము చెప్పారట.

కాని నాకు మాత్రం ఏమీ తోచడంలేదు. బొమ్మలు వేయబుద్ధవటం లేదు. డ్రాయింగు పేపరు తీసి బోర్డుకు బిగించి పెన్సిలు పట్టు కునేటప్పటికి ఎదురుగా మంచంపై అచేతనంగా పడియున్న పద్మావతి కళ్ళకు కట్టినట్లు కన్పిస్తూండేది. ఇక చిత్రం వెయ్యబుద్ధి పుట్టేది కాదు.

ఒక్కొక్కప్పుడు నా మనస్తత్వానికి నాకే నవ్వువస్తుంది. లేకపోతే ముక్కు, మొగము ఎరుగని అమ్మాయిని గూర్చి ఏమిటీ ఆలోచనలు? ఎందుకింత మనస్సు పాడుచేసుకోవడం? నాలో నేను చాలాసార్లు తర్కించుకున్నాను.

నా స్వరూపము నా ఎదురుగుండా వచ్చి నన్ను హేళన చేసేది. నాకు చాలా భయమేసేది. నాకు కూడా పిచ్చి రాదు కదా అనుకుని గట్టిగా కళ్ళుమూసుకునే వాడిని. భగవంతుణ్ణి పద్మావతికి త్వరగా జ్వరం పోయేటట్లు చేయుమని వేడుకునే వాడిని. మామూలుగా ఏదో వేళకి, భోజనం అయిందనిపించి, సాయంకాలం అలా యాదాలాపంగా రామకృష్ణ మఠంలోకి వెళ్ళి కూర్చొని సాయంకాలం పురాణం వినేవాడిని. అక్కడువున్నంత సేపు బాగానే వుండేది. కాని యింటికి వచ్చే సరికి చిక్కిపోయిన పద్మావతి ముఖం నన్ను పలకరించేది. ఏమీ తోచేదికాదు. భోజనం చేసి మౌనంగా ఆలోచిస్తూ పడుం వాళ్ళేవాడిని. ఎప్పుడు నిద్రదేవత వరించేదో మళ్ళీ ప్రొద్దుట లేచేవాణ్ణి. యీరోజులు విస్సారంగా, అను భూతుల్లేకుండా దొర్లుతున్నాయి. నాలో మార్పులు అందరికి కన్పిస్తూన్నాయి. కాని అడుగుతే ఏం బాధ పడతానవో, కాని ఎవరూ ఎదురుగుండా ఏమీ అనలేక పోతూన్నారు.

ఆరోజు నాజీవితంలో యిప్పటికీ మరపు రావటం లేదు. ఎంత ఆనందించానో, నాకే తెలియదు. సుమారు పదిహేను రోజుల తర్వాత నా జీవితానికి ఎంతో ఆనందాన్నిచ్చింది. ఎందుకంటే రామారావు చాలా ఆతృతగా వచ్చాడు నాకోసం.

"ఏమిటో ఈమధ్య చాలాసార్లు వచ్చాను. యింట్లో వుండటంలేదు. ఎక్కడికి వెళ్ళుతున్నావు!" అన్నాడు.

"ఏమీలేదు, ఏమీ తోచకపోతే అలా తిరుగుతున్నాను." అన్నాను.

"సరే ఏకీవేళ ఓ మంచి సంగతి చెప్తాను! ఏమిటో వూహించుకో!" అన్నాడు.

"నాకు మంచి సంగతులేమున్నాయి! అదేదో నువ్వు చెప్పు. యిప్పుడు నేనాలోచించే స్థితిలో లేనన్నాను."

వాడూరుకున్నాడు. వాడే చెప్తాడనుకొని నేనూ మాట్లాడకుండా, శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాను. చివరకు రామారావు చెప్పాడు.

"పద్మావతికి ఒంట్లో కులాసాగా వుంది మరో పదిరోజుల్లో కాలేజీకి కూడా వస్తుంది యిప్పుడు మామూలు మనిషిలాగే తిరుగుతూంది."

విన్నవి ఈ రెండు ముక్కలయినా, నేనెంత సంతోషించాను. అమాంతం రామారావుని ఎంత మెచ్చుకున్నాను. అసలు ఎవరి నోటంటయినా జ్వరం తగ్గి మామూలు మనిషిలోకి వస్తుందా అనే మాటలు విందామా అనుకున్నాను. అదే నిజమయింది. నా మనస్సులోని చీకట్లు మటుమాయమయ్యాయి. ఆ రోజు నేనెంతో ఆనందించాను.

రామారావు మెల్లిగా నవ్వుతూ "యిప్పటికయినా చెప్తావా, ఆమెను ప్రేమిస్తూన్నానని" అన్నాడు.

పద్మావతి నాకు సుపరిచిత. ఆ పద్మావతి పేరు, రామారావు ద్వారా ఎన్నోసార్లు విన్నాను. నా బొమ్మలో ఆమె పోలికలు ఎప్పుడైతే వచ్చాయని రామారావు చెప్పాడో ఆనాడు నాకు ఆమె మీద అభిమానం ఏర్పడింది. అంతే! దాన్ని ప్రేమ అని అనుకోలేకపోతున్నాను. ఆవిషయమే రామారావుతో చెప్పాను.

"పద్మావతిని నేను ప్రేమించడం లేదు. ఆమె అంటే నాకు అభిమానం వుంది. ఆమె కష్టానికి నేను విచారిస్తాను. ఆమె నవ్వుతే నేను సంతోషిస్తాను. అంతే! ఇది ప్రేమ కాదు. ఆమెను నావస్తువుగా చేసుకోవాలని కోర్కెలేదు. దీన్ని అభిమానం అంటారు" అన్నాను.

రామారావు వికృతంగా నవ్వి ఎక్కువసేపు బాధించకుండా వెళ్ళిపోయాడు. అతని నవ్వులో నాకు సంశయం కనిపించింది. అశేషమైన ప్రజ అతనిలా అసహ్యంగా నవ్వుతున్నట్టనిపించారు. అందరి అభిప్రాయాలతోనూ,అతనూ అసహ్యంగా నవ్వడం నాకు ఆశ్చర్యం కలిగించలేదు. లోకం తీరే అంత. ప్రజలు యింకా సంస్కారులు కాలేదు. అభిమానాన్ని ప్రేమను ఒక్కటిగానే చూసే గుడ్డితనం మనలో పాతుకుపోయింది. అది పెకలించే వరకూ అంతే.

పద్మావతి ఎవరో నాకు తెలీదు. ఆమెను నేనెప్పుడూచూడలేదు.కాని ఆమె ఎలా ఉంటుందో వూహించగలను. అంతా ఆమె నా చిత్రాల్లోని స్త్రీమూర్తుల్లా వుంటుందని చెప్తున్నారు గనుక ఆమె ఆకారాన్ని నేను వూహించగలను. అంతే! అంతకన్నా ఆమెను గూర్చి నాకు ఎక్కువ తెలియదు. కాని ఆమె జబ్బుపడిందంటే నేను బాధ పడ్డాను. ఆమె బాగుపడాలని పదేపదే తలంచాను. ఒకవేళ ఆమె బాగవ్వడానికి నా సాయం కావలసివస్తే తప్పకుండా చేసేవాడిని. అంత మాత్రం చేత ఆమెను ప్రేమిస్తున్నానని అనుకోవటం పొరపాటు.

రైల్లో చాలాసేపు ప్రయాణంచేసి, దిగిపోతున్నప్పుడుమనస్సు ఎందుకోఅదోలావుంటుంది. ఆపెట్టెలో వారిని విడిచి వెళ్ళిపోతున్నామని బాధ కలుగుతుంది. దీన్ని ప్రేమ అనలేము. అభిమానం అంటాం. అంతే! పద్మావతి అంటే కూడా నాకు అదే అభిమానం. దీన్ని మరోలా వూహించాల్సిన అవసరం నాకు కనిపించలేదు.

పద్మావతి ఎలాగయితేనే మామూలు మనిషయింది. అంతే చాలు. పద్మావతిని చూడకపోయినా సరే, ఆమె కూడా శ్రీమతియై సుఖంగా జీవించాలని, నా వూహాసుందరిఎప్పటికీ సంతోషంగావుండాలని ఏ మనఃపూర్వకంగా అభినందించుకున్నాను. తేలికగా నా కళ్ళనుండి రెండు ఆనందబాష్పాలు రాలాయి ★

